క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న గోపాల్‌దాస్

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కార్యాలయ సూపరింటెండెంట్‌గా కె.గోపాల్ దాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతి ద్వారా ఆయనకు ఈ స్థానం లభించగా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరణం హరిబాబు, వైద్యులు కల్యాణ్‌బాబు, మహేష్, అప్పలనాయుడు, కోటేశ్వరరావు, రాజశేఖర్, ప్రధాన్ తదితరులు ఆయనను అభినందించారు.

వస్త్రదానం

రామభద్రపురం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తూముల దాలయ్య కుటుంబ సభ్యులు రామభద్రపురంలోని 300 మంది నిరుపేదలకు శుక్రవారం వస్త్రదానం చేశారు. మగవారికి దుప్పటి, పంచ, పండ్లు, ఆడవారికి దుప్పటి, చీర, పండ్లు చొప్పున అందజేశారు. ఏటా తమ తండ్రి జ్ఞాపకార్థం సంక్రాంతి రోజున బట్టలు దానం చేస్తూ వస్తున్నామని, అయితే అనివార్య కారణాల వల్ల ఈ ఏడాది సంక్రాంతికి ఇవ్వలేకపోయామని, అందుకే ఇప్పుడు అందించామని దాతలు తెలిపారు. కార్యక్రమంలో తూముల గోపాల కృష్ణ, తూముల వాసుదేవరావు, తూముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'చెప్పాడంటే.. చేస్తాడంతే'



ఇజ్జిపేటలో ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధి తెలిపే కరపత్రంను లబ్ధిదారుడికి అందిస్తున్న వలంటీర్ నవీన్

సంతకవిటి: మండల వ్యాప్తంగా చెప్పాడంటే.. చేస్తాడంతే కార్యక్రమం చాలా చురుగ్గా కొనసాగుతోంది. ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలు వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా జరిగిన లబ్ధిని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను, నెరవేర్చిన హామీలను కరపత్రాల ద్వారా తెలిపారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



స్వామి కల్యాణం జరిపిస్తున్న భక్తులు

బాడంగి: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణులంతా హాజరై, తొలుత వీరబ్రహ్మేంద్రస్వామి దంపతుల విగ్రహాలకు పాలాభిషేకం చేసి, వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణం జరిపించారు. ఈ వేడుకను చూసేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వేణుగోపాలనాయుడు


బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ శంబంగి వేణుగోపాలనాయుడు శుక్రవారం భూమిపూజ చేశారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, రమేష్, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత కొలతల్లో పనులు చేయాలి

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయాలని ఏపీవో ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. వేతనదారులు రెండు పూటలా పని చేయాలని, పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని తెలిపారు.

శివోహం!

వాడవాడలా శివనామస్మరణ మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం వేకువజాము నుంచే మందిరాలకు పోటెత్తిన భక్తజనం ఆ పరమశివుడికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు, దీపారాధనలు చేశారు. హరహర మహదేవ, శంభో శంకర, ఓం శివోహం అని ఈశ్వరుని స్మరించారు. రాత్రి అంతా జాగరణ చేసి, నీలకంఠునిపై ఉన్న భక్తిభావం చాటుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్.



బాడంగి: మండల కేంద్రంలోని ఉమాసోమేశ్వరునికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



సంతకవిటి: ఎస్.రంగారాయపురంలో పూజలందుకుంటున్న జ్యోతిర్లింగం



రాజాం: ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకుల పూజలు



రేగిడి: భక్తులతో కిక్కిరిసిన సంకిలి శివాలయం



రాజాం: పెనుబాకలో ఏకాహ భజనల్లో జెడ్పీటీసీ నర్సింహులు, తదితరులు



రాజాం: కొండంపేట శివాలయంలో దైవదర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు



సంతకవిటి: తమరాంలోని శివాలయంలో దర్శనానికి క్యూలైన్‌లో నిల్చొన్న భక్తులు



రామభద్రపురం: నందెన్నకు పూజలు చేస్తున్న భక్తులు



వంగర: సంగాం ఆలయంలో పూజలు చేస్తున్న డీఎస్పీ చక్రవర్తి



వంగర: సంగాంలో ద్వాపరయుగంలో బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగం వద్ద భక్తుల పూజలు



తెర్లాం: పెరుమాళి శివాలయంలో మహాశివరాత్రి పూజలు



రాజాం సిటీ: పొగిరి శివాలయంలో క్యూ లైన్‌లో భక్తులు

రూ.17 కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు



గజపతినగరంలో నిర్మాణ దశలో వంద పడకల ఆస్పత్రి

గజపతినగరం: మండల కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో 30 పడకలుగా ఉన్న ఈ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా ఆధునికీకరణ చేస్తానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న సమయంలో గజపతినగరం ప్రజలకు ఇచ్చిన మాటను ఈ రోజు అక్షరాలా నిలబెట్టుకున్నారు. 17కోట్ల రూపాయలతో శరవేగంగా ఆస్పత్రి నిర్మాణం పనులు పూర్తయిన తరువాత గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల రోగులకు అన్ని శస్త్రచికిత్సలు, వైద్యసేవలు సంపూర్ణంగా అందనుండడంతో నాలుగు మండలాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మేము సిద్ధం - మా బూత్ సిద్ధం



వావిలపాడులో మేము సిద్ధం - బూత్ సిద్ధం అంటూ నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో బూత్ స్థాయిలో మేము సిద్ధం - మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గుబాబు నేతృత్వంలో శుక్రవారం నిర్వహించారు. కుమ్మపల్లి, వావిలపాడు, తదితర బూత్‌లలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా కడుబండి శ్రీనివారావును, విశాఖ పార్లమెంటు సభ్యురాలుగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు మండల ప్రధాన కార్యదర్శి ద్వారపూడి గంగునాయుడు, నేతలు బీల సతీష్, చినబ్బినాయుడు, శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

10న గురుకులాల్లో ప్రవేశ పరీక్ష

చీపురుపల్లి: బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలల్లో ఐదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఈ నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు స్థానిక గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాణీశ్రీ శుక్రవారం చెప్పారు. ఈ నెల 10న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదవ తరగతిలో ప్రవేశాలకు పరీక్ష నిర్వహించనున్నామని, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా పరీక్షకు గంట ముందు, ఐడీ ప్రూఫ్‌తో పరీక్ష కేంద్రానికి హాజరవ్వాలని చెప్పారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



రాజాం సిటీ: రాజాం పట్టణంలో మహిళలను సత్కరిస్తున్న మానవతా సంస్థ ప్రతినిధులు

తెర్లాం: మండల కేంద్రంతో పాటు మండలంలోని నందబలగ, పెరుమాళి గ్రామ ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సిబ్బంది, విద్యార్థులు కలిసి సన్మానించారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మహిళల గొప్పతనం ప్రశంసించి, స్ఫూర్తి నింపారు.

రాజాం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, సన్‌రైజ్ ఆస్పత్రి ఎండీ మాధవీలతలు పట్టణంలో పలు ఆస్పత్రుల్లో ఇంటర్న్‌షిప్ ద్వారా ఉచితంగా సేవలందిస్తున్న విద్యార్థినులను సత్కరించారు. ఈ సందర్భంగా తలే రాజేష్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, యూత్ అధ్యక్షులు వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించి, వైద్య తనిఖీల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

రాజాం సిటీ: స్థానిక పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత సంస్థ రాజాం శాఖ ప్రతినిధులు పట్టణానికి చెందిన కె.చంద్రావతి, ఎంపీపీ లావేటి సులోచన, ప్రముఖ వైద్యులు యడ్ల నీరజ, పట్టా గవర్రాజు, ఎస్.జయలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. పొగిరి జెడ్పీ హైస్కూల్‌లో చేపట్టిన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.



రాజాం: మహిళా దినోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్, సన్‌రైజ్ ఆస్పత్రి ఎండీ మాధవీలత



తెర్లాం: నందబలగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన సిబ్బంది

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని 20, 21వ వార్డులకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్ సీపీలో శుక్రవారం చేరాయి. స్థానిక మాదిగవీధి సచివాలయం వద్ద పార్టీలో చేరిన వారందరికీ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో రోజురోజుకూ చేరికలు ఎక్కువవుతుండడం చాలా ఆనందంగా ఉందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని నమ్మే పార్టీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అందరూ కోరారు. పార్టీలో చేరిన వారిలో మాదిగవీధికి చెందిన యందవ వెంకయ్య, మధు, రాయప్ప, పేరమ్మ, పి.చిరంజీవి, వై.జోసెఫ్, పి.పాపారావు, పి.ప్రమోద్, వై.ఆకాష్, నిర్మల, ఎల్.చిన్నమ్ముడులతో పాటు మరో 40 కుటుంబాల వారు ఉన్నారు. వీరంతా జై జగన్.. జై వైఎస్సార్ సీపీ నినాదాలు చేస్తూ 2024 ఎన్నికల్లో పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు. రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా కొనసాగిస్తున్న పాలన, పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తుండడం, ప్రజల మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తూ చేస్తున్న అభివృద్ధి పనులు చూసి, ఆకర్షితులై తామంతా పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, పార్టీ యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పరిశీలన



తాగునీటి నాణ్యతను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు శుక్రవారం పర్యటించి, కుళాయిల ద్వారా ఇంటింటికీ సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యతను పరిశీలించారు. అలాగే స్థానికులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, ఏ సమస్య తలెత్తినా తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించి, సహకరించాలని పట్టణవాసులను కోరారు.

రబీకి పుష్కలంగా సాగునీరు



మడ్డువలస కుడికాలువ ద్వారా పొలాలకు తరలిస్తున్న సాగునీరు

రేగిడి: మండలంలో రబీ సీజన్‌లో రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న, వేరుశెనగ, చెరకు తదితర పంటలకు మడ్డువలస కాలువ సాగునీరు పుష్కలంగా అందుతోంది. ఈ నేపథ్యంలో అంబఖండి, ఉంగరాడ, వండానపేట, వన్నలి, చాటాయివలస, కోడిశ గ్రామాల్లో మొక్కజొన్న సాగు అధికంగా జరుగుతోంది.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 20, 21వ వార్డుల్లో శుక్రవారం పర్యటించిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ పాలన కొనసాగుతోందని, సీఎం జగనన్న తన ప్రజాసంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రతీ గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు చేసి, ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చారన్నారు. అలాగే ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్ వంటి వసతులు కల్పించారన్నారు. రాష్ట్రంలోని సచివాలయ, వలంటీర్ వ్యవస్థల సేవలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. ఆయనను రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని, ఆ దిశగా పార్టీ శ్రేణులంతా శ్రమించాలని కోరారు. ఎన్నికల వేళ ఎలాగైనా అధికారంలోకి రావాలన్నా దురాశతో టీడీపీ నేతలు మాయ మాటలు చెబుతారని, వాటిని నమ్మవద్దన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పలు సంఘాల నాయకులను కలిసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.